

మధురానగర్ మెట్రోస్టేషన్ వద్ద సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

నగరంలో మెట్రో రైలు కోచ్‌లు పెంచాలి

● సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

పంజాగుట్ట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో మెట్రో రైలులో కోచ్‌లు పెంచాలని డిమాండ్ చేస్తూ మధురానగర్ మెట్రో స్టేషన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకుడు సీ.హెచ్ చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ మెట్రో రైలులో రద్దీ విపరీతంగా ఉంటోందని, మెట్రో రైలు ఎక్కాలన్నా, దిగాలన్నా ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ప్రస్తుతం మెట్రోకు మూడు బోగీలు ఉన్నాయని, వాటిని ఆరు బోగీలకు పెంచాలని డిమాండ్ చేశారు. బోగీలు పెంచడం వల్ల ప్రయాణికులు ఇంకా ఎక్కువ మంది మెట్రోలో ప్రయాణించే అవకాశం ఉంటుందని, ట్రాఫిక్, పొల్యూషన్ కూడా తగ్గుతుందని అన్నారు. నగరంలోని అన్ని మెట్రో స్టేషన్ల వద్ద సంతకాల సేకరణ అనంతరం ఈ నెల 17న బేగంపేటలోని మెట్రో భవన్ వద్ద ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జూబ్లీహిల్స్ జోన్ కమిటీ కన్వీనర్ రావర్తి అశోక్, నాయకులు టి.సాయిశేషగిరిరావు, యాదగిరి, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, తెలంగాణ విద్యుత్ బీసీ, ఓసీ ఉద్యోగుల జేఏసీ నాయకులు

విద్యుత్ శాఖలో పదోన్నతులు కల్పించాలి

● తెలంగాణ విద్యుత్ బీసీ, ఓసీ ఉద్యోగుల జేఏసీ

పంజాగుట్ట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యుత్ శాఖలో బీసీ, ఓసీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, వారికి పదోన్నతులు ఇవ్వాలని తెలంగాణ విద్యుత్ బీసీ, ఓసీ ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేసింది. డిమాండ్ల పరిష్కారం కోసం సెప్టెంబర్ 4న ఖైరతాబాద్‌లోని విద్యుత్ సౌధలో మహాధర్నా నిర్వహించనున్నట్టు జేఏసీ నాయకులు తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య, జేఏసీ ఛైర్మన్ కె.కుమారస్వామి, కన్వీనర్ ఎం.వెంకన్న గౌడ్, కో ఛైర్మన్ ఆర్. సుధాకర్ రెడ్డి, కో-కన్వీనర్ సి.భాను ప్రకాష్ లతో కలిసి మాట్లాడారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల ప్రకారం తెలంగాణ విద్యుత్ సంస్థల్లో 2014 జూన్ 2 నుంచి ఇచ్చిన పదోన్నతులను సమీక్షించి, నష్టపోయిన బీసీ, ఓసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ సాధారణ పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థలలో డైరెక్టర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

వేణుస్వామికి మహిళా కమిషన్ నోటీసులు

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22న స్వయంగా మహిళా కమిషన్ ఎదుట హాజరు కావాలని వేణుస్వామికి తెలంగాణ మహిళా కమిషన్ మంగళవారం నోటీసులు జారీ చేసింది. ఇటీవల సినీ నటుడు అక్కినేని నాగచైతన్య, శోభిత ధూళిపాళలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన వేణుస్వామిపై చర్యలు తీసుకోవాలని సోమవారం తెలుగు ఫిల్మ్ జర్నలిస్టుల అసోసియేషన్, తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా అసోసియేషన్ సంయుక్తంగా తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారదకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుకు స్పందించిన ఛైర్‌పర్సన్ వేణుస్వామికి నోటీసులు జారీ చేసింది.

నేడు ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్ మేళా

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత కోసం జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ అర్హత కలిగి ఆసక్తి ఉన్న నిరుద్యోగులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో బుధవారం ఉదయం 10.30 గంటలకు జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో జరిగే జాబ్‌మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు. జె గ్రూప్ కంపెనీలో ఉద్యోగాల కోసం నిర్వహిస్తున్న జాబ్‌మేళాలో ఎంపికైన వారికి రూ.15 వేల వేతనం ఉంటుందని, ఆసక్తి కలిగిన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మీడియా కమ్యూనికేషన్ రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా చౌదరి గౌడ్

అమీర్‌పేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మీడియా, కమ్యూనికేషన్స్ రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా కమ్మగోని చౌదరి గౌడ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్స్ రాష్ట్ర ఛైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి నియామకపు ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా చౌదరి గౌడ్ మాట్లాడుతూ పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ కోసం సైనికుల్లా పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఛైర్మన్ రామ్మోహన్ రెడ్డి, ఇర్ఫాన్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఖైరతాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... ఖైరతాబాద్ మార్కెట్ ప్రాంతంలో నివసించే కృష్ణ(45) జీహెచ్‌ఎంసీ చెత్తను సేకరించే పని చేస్తూ రాత్రి వేళల్లో రెండు వైన్స్ దుకాణాల్లో పని చేసేవాడు. ఇతడు లక్ష్మి అనే మహిళ ఇంట్లో ఉండేవాడు. సోమవారం అతడి మిత్రు డు చిట్టి రామకృష్ణ అనే వ్యక్తి అతడి గది వద్దకు వచ్చి మాట్లాడి వెళ్లాడు. అదేరోజు సాయంత్రం అతడు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో మృతి చెందినట్లు లక్ష్మి గుర్తించింది. కాగా మృతుడి పేరు కృష్ణ అని మాత్రమే తెలుసునని, అతడు 20 సంవత్సరాలుగా నగరంలో ఉంటున్నాడని, ఆయన బంధువులు ఎవరో తెలియదని తెలిసినవారందరూ పేర్కొన్నారు. మద్యం తాగే అలవాటున్న మృతుడు జాండీస్ వచ్చినా మద్యం తాగడం వల్ల మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు తెలిపారు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.


అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన బోనాలలో పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్, గుత్తా సుఖేందర్‌రెడ్డి



సమస్యల కాలనీ.. అవస్థల్లో స్థానికులు



నాగార్జుననగర్ కాలనీ విజయటవర్స్ వద్ద రోడ్ల పై పొంగుతున్న డ్రైనేజీ


రోడ్డుకు పక్కనే పేరుకుపోయిన చెత్త

బంజారాహిల్స్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పేరుకే కాలనీ అన్నీ సమస్యలే అన్నట్లుగా ఉంది ఈ కాలనీ పరిస్థితి. రోడ్లపైనే మురుగు పరుగు, ఎక్కడి చెత్త అక్కడే, దోమల స్వైర విహారం, వెలుగని వీధి దీపాలతో నాగార్జుననగర్‌కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు.

నాగార్జుననగర్‌కాలనీ ఏర్పడ్డాక మొట్టమొదటగా విజయటవర్స్, రామకృష్ణ అపార్ట్‌మెంట్‌ల నిర్మాణాలు జరిగాయి. రోడ్డు, ఇతర సదుపాయాలు మెరుగ్గా ఉండడంతో అపార్ట్‌మెంట్లలో నివాసముండేందుకు అప్పట్లో తీవ్ర పోటీ నెలకొంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో సమస్యలు తిష్టవేశాయి. అపార్ట్‌మెంట్‌ల సమీపంలో ఏ రోడ్డుపై చూసినా డ్రైనేజీ మురుగే దర్శనమిస్తోంది. నిత్యం మురుగు పొంగడంతో జీహెచ్‌ఎంసీ పారిశుధ్య సిబ్బంది చెత్తను ఎత్తకపోవడంతో దోమలు వృద్ధిచెంది స్వైరవిహారం చేస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ వీధి దీపాలు వెలుగక చీకట్లో ప్రమాదాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉమ్మడి సర్వీస్ రూల్స్‌తో ఉపాధ్యాయులకు అన్యాయం

● ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాసం ప్రభాకర్

పంజాగుట్ట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధ్యం కాదని, డిప్యూటీ ఈఓ, ఎంఈఓ, డైట్ లెక్చరర్, జూనియర్ కాలేజీ లెక్చరర్ తదితర పోస్టులను పదోన్నతి ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇవ్వడం లేదని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాసం ప్రభాకర్ అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం అసోసియేట్ అధ్యక్షుడు టి.ప్రకాష్ గౌడ్, ఉపాధ్యక్షుడు ఎండీ కలీల్ అహ్మద్, తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా విద్యాశాఖలో పని చేస్తున్న సుమారు 12 వేల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు రావల్సిన పదోన్నతులు రాలేదని అన్నారు. గత ప్రభుత్వాలు ఉమ్మడి సర్వీస్ రూల్స్ పేరుతో జీవోలు తెచ్చి ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కలిపి ఇవ్వడంతో తమకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఆ జీవోలపై తాము రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ఉమ్మడి సర్వీస్ రూల్స్ చెల్లదని తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని అన్నారు. అన్ని మండలాలకు ప్రభుత్వ ఉపాధ్యాయులకే పదోన్నతులు కల్పించి ఎంఈఓలుగా నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం నాయకులు వై. కృష్ణారావు, పోశం కృష్ణమూర్తి, శ్రావణ్ కుమార్, సైదుల్ రెడ్డి, సంపత్ కుమార్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ


ఖైరతాబాద్‌లో తిరంగా ర్యాలీలో బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తదితరులు


జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి ర్యాలీగా వెళుతున్న బీజేపీ నాయకులు

బంజారాహిల్స్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా బీజేవైఎం పిలుపు మేరకు బీజేపీ నాయకులు మంగళవారం తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో జూబ్లీహిల్స్‌లో మొదలైన ర్యాలీని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం స్వయంగా ద్విచక్ర వాహనం నడిపిస్తూ నియోజకవర్గం మొత్తం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా చింతలరామచంద్రారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. బీజేపీ నాయకులు బోజిరెడ్డి, గడ్డం రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో...

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీజేపీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గంలో అన్ని చోట్ల త్రివర్ణ పతాకాన్ని చేత పట్టుకొని ద్విచక్ర వాహనంపై ర్యాలీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు లంకల దీపక్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కుంభాల గంగరాజు, నాయకులు ప్రేమ్‌కుమార్, శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బైక్ ర్యాలీ

ఖైరతాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగాపై అవగాహన కల్పిస్తూ బీజేవైఎం నాయకులు ఖైరతాబాద్ నియోజకవర్గంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఖైరతాబాద్, పంజాగుట్టలతో పాటు హిమాయత్‌నగర్‌లో ఈ ర్యాలీ జరిగింది. మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొని యువతలో జోష్ నింపారు. ప్రతి ఇంట్లో జాతీయ జెండాను ఎగురవేసి జాతి నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

రహ్మత్‌నగర్ కార్మికనగర్‌లో

యూసుఫ్‌గూడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీజేపీ నేతల ఆధ్వర్యంలో తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. రహ్మత్‌నగర్ కార్మికనగర్‌లో నియోజకవర్గం ఇన్‌చార్జి లంకల దీపక్‌రెడ్డి జాతీయ జెండా ఊపి తిరంగా బైక్ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు డాక్టర్ పద్మ వీరపనేని, కుంబాల గంగరాజు, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


అమీర్‌పేట జీహెచ్‌ఎంసీ గ్రౌండ్‌లో జాతీయ గీతం ఆలపిస్తున్న బీజేపీ నాయకులు


తిరంగా బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జూబ్లీహిల్స్ బీజేపీ ఇన్‌చార్జి లంకల దీపక్‌రెడ్డి


గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

50 పాఠశాలల్లో చెస్ పోటీలు నిర్వహిస్తాం

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్లాన్ అంతర్ పాఠశాలల చెస్ టోర్నీలో భాగంగా మంగళవారం యూసుఫ్‌గూడ మారుతీనగర్‌లోని మహాత్మాగాంధీ మెమోరియల్ స్కూల్‌లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. స్లాన్ స్పోర్ట్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నవీన్, పాఠశాల కోచ్ ఇమ్రోజ్ ఈ పోటీలను పర్యవేక్షించారు. బాలురు, బాలికలకు 1 నుంచి 7వ తరగతి, 8 నుంచి 10వ తరగతి వరకు రెండు విభాగాలుగా పోటీలు ఏర్పాటు చేశారు. జూనియర్ బాలికల్లో సంపథం అర్హవి (5వ తరగతి), రుత్విక (6వ తరగతి) తొలి రెండు స్థానాల్లో నిలిచారు. బాలుర జూనియర్స్‌లో పి.నికేత్ (3వ తరగతి), సంపథం జతిన్ (6వ తరగతి), దేవాశిష్ (7వ తరగతి), బాలుర సీనియర్స్‌లో మణికంఠ (9వ తరగతి), యువరాజ్ (8వ తరగతి), కార్తికేయ (9వ తరగతి) విజేతలుగా నిలిచారు. నగరంలోని 50 పాఠశాలల్లో పోటీలు నిర్వహిస్తామని, 2500 మంది విద్యార్థులకు అవకాశం ఉంటుందని నవీన్ తెలిపారు. పాఠశాల స్థాయిలో గెలుపొందినవారు తదుపరి దశలో రూ.50 వేల నగదు బహుమతి కోసం పోటీ పడతారని వివరించారు.

ఆంజనేయస్వామికి పుష్పాలంకరణ



బంజారాహిల్స్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14 లోని నందినగర్ ఆంజనేయస్వామిని ఆలయ అర్చకులు శ్రావణ మాసం రెండో మంగళవారం సందర్భంగా సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శేష శైలాచార్యులు, కిరణ్ కుమారా చార్యులు మాట్లాడుతూ 1516 లక్ష్మీ తామర పుష్పాలతో స్వామి వారిని అలంకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ దశరథ, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్‌కు నోటీసులు

బంజారాహిల్స్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌లో నమోదైన ఓ కేసు విషయంలో మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ పోలీసుల ఎదుట విచారణకు హాజరై నోటీసులు తీసుకున్నారు. సెన్సార్ బోర్డు సభ్యత్వం ఇప్పిస్తామని ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ ఓ వ్యక్తి వద్ద నుంచి పది లక్షల రూపాయలు తీసుకొని మోసం చేశారు. ఈ వ్యవహారంలో బాధితుడి ఫిర్యాదు మేరకు దిలీప్‌కుమార్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా దిలీప్‌కుమార్ కోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఆయనకు నోటీసు ఇచ్చి పంపించారు.


ప్రజావాణిలో అర్జీలను స్వీకరిస్తున్న చిన్నారెడ్డి, ప్రత్యేక అధికారి దివ్య

ప్రజావాణికి 475 దరఖాస్తులు

బేగంపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణిలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి, ప్రజావాణి ప్రత్యేకాధికారి దివ్య ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. మంగళవారం ప్రజావాణికి మొత్తం 475 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూకు సంబంధించి 120, మైనారిటీ వెల్ఫేర్‌కు చెందిన 60, సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన 53, పౌరసరఫరాల శాఖకు చెందిన 36, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధికి సంబంధించి 38, ఇతర శాఖలకు చెందినవి 168 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

దశలవారీగా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం

● ఎమ్మెల్యే దానం నాగేందర్


కమ్యూనిటీ హాల్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ ప్రభాకర్ రావు

పంజాగుట్ట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బస్తీలు, కాలనీలు అనే తేడా లేకుండా దశలవారీగా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఎమ్మెల్సీ ఎం.ఎస్. ప్రభాకర్ రావు నియోజకవర్గ నిధుల నుంచి కేటాయించిన రూ.19.98 లక్షలతో తుమ్మలబస్తీలో నిర్మించిన కమ్యూనిటీ హాల్ భవనాన్ని ఆయన ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్ రావుతో కలిసి ప్రారంభించారు. కమ్యూనిటీ హాల్ పైన అదనపు అంతస్తు నిర్మాణం కోసం, సీసీ కెమెరాల ఏర్పాటు కోసం నిధులు కేటాయించాలని సమైక్య భారతి యూత్ అసోసియేషన్ సభ్యులు వారికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజశేఖర్, ఎస్ఐ నాగరాజు, ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేంద్రకుమార్, అధ్యాపకులు డాక్టర్ జగన్మోహన్, తుమ్మల బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాదయ్య, సమైక్య భారతి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.


మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం లోగోను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలి

● ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

పంజాగుట్ట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అమరవీరుల కుటుంబాలను, ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సామ అంజిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి కోడి సైదులు, ఉపాధ్యక్షుడు పిడమర్తి లింగయ్య, కోశాధికారి ఎం.గోవర్ధన్ తదితరులతో కలిసి సంఘం లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలపైన సీఎం రేవంత్ రెడ్డి స్పందించి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే మరో ఉద్యమం తప్పదని ఆయన హెచ్చరించారు. సమావేశంలో సంఘం నాయకులు రఘునందన్‌రెడ్డి, యాకయ్య, ఎస్.కె.యూసుఫ్ షరీఫ్, శైలేందర్, ఉద్యమకారులు కె.వెంకన్న, కె.మధుసూదన్‌రెడ్డి, సిద్ధారెడ్డి, జె.సమునయ్య, కె.మాధవి, పి.రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లకు ఒకేచోట డస్ట్ బిన్ ఉండాలి

● గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్‌లో డోర్ టూ డోర్ తిరగకుండా ఒకేచోట డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేస్తే చెత్త సేకరణ సులభతరమవుతుందని, అందుకోసం అపార్ట్‌మెంట్ అసోసియేషన్లను సంప్రదించి బిన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కమిషనర్ ఆమ్రపాలి అడిషనల్, జోనల్ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపార్ట్‌మెంట్‌లలో చెత్తసేకరణ వివిధ కారణాలతో పూర్తి స్థాయిలో స్వచ్ఛ ఆటోలకు రావడం లేదని, డస్ట్‌బిన్ ఏర్పాటు చేయడం వల్ల చెత్తను స్వచ్ఛ ఆటోలో తీసుకునేందుకు సులభతరమవుతుందని అన్నారు. పార్కుల వద్ద పరిశుభ్రంగా ఉండేలా డస్ట్‌బిన్లు ఉండాలన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చెత్త వేయకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్ల వివరాల నివేదిక అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జంక్షన్ల వద్ద వాహనదారులకు ఆహ్లాదకరంగా ఉండే విధంగా పూల మొక్కలు ఏర్పాటు చేయాలని యూబీడీ అధికారులకు సూచించారు. పశువులు రోడ్లపై సంచరించకుండా క్షేత్రస్థాయి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు.

'అవయవాలు లభించక ప్రాణాలు పోతున్నాయి'

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అవయవాలు లభించక దేశవ్యాప్తంగా మూడు లక్షల మందికిపైగా మరణిస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయని యశోద ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి పేర్కొన్నారు. అంతర్జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా మంగళవారం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన 'సెలబ్రేటింగ్ సెకండ్ చాన్స్ సే' కార్యక్రమంలో గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, లివర్ మార్పిడి చేసుకుని పునర్జన్మ పొందిన రోగులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రాష్ట్రంలో అవయవదానాల సంఖ్య క్రమంగా పెరుగుతున్నాయని పవన్ తెలిపారు.



సమస్యలు వివరిస్తున్న మధురానగర్ సంక్షేమ సమితి ప్రతినిధులు

శంఖారావంలో సమస్యల వెల్లువ

వెంగళరావునగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సమస్యలపై శంఖారావం కార్యక్రమంలో సమస్యలు వెల్లువెత్తాయి. ఒక్క డివిజన్‌లోనే సమస్యలపైన స్థానికులు వివిధ విభాగాల అధికారులకు మూడు వందలకు పైగా వినతిపత్రాలు అందించారు. మంగళవారం సిద్ధార్థనగర్ కమ్యూనిటీ హాలులో వెంగళరావునగర్ డివిజన్ ప్రజా సమస్యలపై శంఖారావం కార్యక్రమం జరిగింది. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ, విద్యుత్, జలమండలి, రెవెన్యూ పౌర సరఫరాలు, ఉద్యానవన శాఖల అధికారులు హాజరయ్యారు. వివిధ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీ, బస్తీవాసులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు .లిఖిత పూర్వకంగా వినతి పత్రాలు ఇచ్చారు. తమ కాలనీలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని, కొంత మంది వాటికి బహిరంగ ప్రదేశాల్లో ఆహారం పెడుతుండడంతో ఇబ్బందులు పడుతున్నామని మధురానగర్ సంక్షేమ సమితి ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు అన్నారు. డ్రైనేజీ, మంచినీటి సమస్య ఉందని, వీధి దీపాలు సరిగ్గా వెలగడం లేదని,సీసీ రోడ్లు వేయాలని కోరారు. తదితర సమస్యలపై ఆయా విభాగాల అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.



లాలాపేట్‌లోని అర్బన్ ఆస్పత్రిలో సౌకర్యాలను అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి తదితరులు

డెంగ్యూ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలి

● జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి

తార్నాక, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వైరల్ ఫీవర్, డెంగ్యూ కేసుల పెరుగుదల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి అన్నారు. మంగళవారం లాలాపేట్‌లోని అర్బన్ ఆస్పత్రిని సందర్శించి, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర ప్రజలు వైరల్ ఫీవర్, డెంగ్యూ వంటి లక్షణాలు ఉన్నట్లయితే నిర్లక్ష్యం వహించకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుని, దోమల వ్యాప్తిని అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో డా.జయశ్రీ, డా.పల్లవి, దుర్గాప్రసాద్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హిమాలయాల్లో భూకంప ప్రమాద అధ్యయనానికి
సీఎస్ఐఆర్, ఎన్ఆర్ఎస్‌సీ అవగాహన ఒప్పందం

ఉప్పల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): హిమాలయ శ్రేణులలో భూకంపానికి కారణమయ్యే వివర్తనిక వికృతిపై విస్తృతమైన అధ్యయనం చేసేందుకు జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థ (సీఎస్ఐఆర్), భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థకి చెందిన జాతీయ రిమోట్ సెన్సింగ్ కేంద్రం (ఎన్ఆర్ఎస్‌సీ) అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈమేరకు మంగళవారం సీఎస్ఐఆర్-ఎన్జీఆర్ఐ సంచాలకులు డా.ప్రకాష్ కుమార్, జాతీయ రిమోట్ సెన్సింగ్ కేంద్రం ఉప సంచాలకులు డా.కె.శ్రీనివాస్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ రెండు సంస్థల మధ్య ఒప్పందం రాబోయే మూడు సంవత్సరాల పాటు కొనసాగనుందని అధికారులు తెలిపారు. భూకంప ప్రమాద మూల్యాంకనం కోసం పశ్చిమ హిమాలయాల్లో భూపటల విరూపణం యొక్క అధిక - రిజల్యూషన్ చిత్రాలను గణించడానికి నిరంతర జీపీయస్ పరిశీలనలు, ఉపగ్రహ ఆధారిత పరిశీలనల ద్వారా భూమిలో కొలిచే భూపటల విరూపణంపై సమాచారాన్ని ఉపయోగిస్తాయి.

ఎన్ఎండీసీ డైరెక్టర్‌గా జాయ్‌దీప్ దాస్ గుప్తా !

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ(ఎన్ఎండీసీ) ప్రొడక్షన్ డైరెక్టర్‌గా జాయ్‌దీప్ దాస్ గుప్తా పేరును పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలెక్షన్ బోర్డు సిఫారసు చేసింది. జాయ్‌దీప్ దాస్ గుప్తా స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నారు. అయితే, న్యూఢిల్లీలో మంగళవారం జరిగిన పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలెక్షన్ బోర్డు సమావేశంలో జాయ్‌దీప్ నియామకంపై చర్చించారు. అలాగే, ఎన్ఎండీసీ ఛైర్మన్ అమితవ్ ముఖర్జీపై లోక్‌పాల్‌లో జరుగుతున్న విచారణపైనా బోర్డు చర్చించింది. అమితవ్ ముఖర్జీపై చేసిన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సమర్పించేందుకు ఫిర్యాదుదారుడికి బోర్డు రెండు వారాలు గడువిచ్చింది.

వేణుస్వామికి మహిళా కమిషన్ నోటీసులు

రాంగోపాల్‌పేట్, ఆగస్ట్ 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22న స్వయంగా మహిళా కమిషన్ ఎదుట హాజరు కావాలని వేణుస్వామికి తెలంగాణ మహిళా కమిషన్ మంగళవారం నోటీసులు జారీ చేసింది. ఇటీవల సినీ నటుడు అక్కినేని నాగచైతన్య, శోభిత ధూళిపాళలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన వేణుస్వామిపై చర్యలు తీసుకోవాలని సోమవారం తెలుగు ఫిల్మ్ జర్నలిస్టుల అసోసియేషన్, తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా అసోసియేషన్ సంయుక్తంగా తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారదకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుకు స్పందించిన ఛైర్‌పర్సన్ వేణుస్వామికి నోటీసులు జారీ చేసింది.



గ్రూప్ కెప్టెన్లతో టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

నేటి బాలలే రేపటి పౌరులు

● టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నేటి బాలలే రేపటి పౌరులని, భావిభారత పౌరులైన విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి ఇలాంటి క్యాబినెట్ లీడర్ల నియామకం దోహదపడుతుందని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ (టీటీఐ) ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. సికింద్రాబాద్ సోమసుందరం వీధిలోని కొత్త ఎల్లయ్య హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులు మంగళవారం విశ్వకర్మ సంఘ భవనంలో క్యాబినెట్ లీడర్ల ఇన్‌వెస్టియేచర్ కార్యక్రమం, పంద్రాగస్టును పురస్కరించుకుని సాంస్కృతిక వేడుకలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శంకర్ రాజు మాట్లాడుతూ... గతంలో కాలేజీలలో విద్యార్థి సంఘాల ఎన్నికలు జరిగేవని, వారే కాలక్రమేణా ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా, ముఖ్యమంత్రులుగా అయ్యేవారని గుర్తుచేశారు. చిన్న నాటి నుంచే నాయకత్వ లక్షణాలను ఈ క్యాబినెట్ లీడర్లకు వస్తుందన్నారు. పాఠశాల వ్యవస్థాపకులు, కార్యదర్శి కొత్త నాగనాదం మాట్లాడుతూ.... చిన్నపిల్లలకు ప్రోత్సాహక వేదికగా ఈ పాఠశాల పనిచేస్తుందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ శంతన్ కుమార్ మాట్లాడుతూ.... ఇలాంటి కార్యక్రమాల వల్ల నాయకత్వ లక్షణాలు పిల్లల్లో అలవడతాయని, భవిష్యత్‌లో వారు వ్యాపార రంగంలో ఉన్నా, పోలీస్ శాఖలో ఉన్నా, ఆర్మీ ఇలా ఏ రంగంలో ఉన్నా వారు ఈ నాయకత్వ లక్షణాల వల్ల తమ గ్రూపులో ఉన్న వారిని మోటివేట్ చేయగలుగుతారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాసం ప్రభాకర్

విద్యాశాఖలో ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధ్యం కాదు

● ఉపాధ్యాయులకే పదోన్నతులు ఇవ్వాలి

పంజాగుట్ట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధ్యం కాదని, డిప్యూటీ ఈఓ, ఎంఈఓ, డైట్ లెక్చరర్, జూనియర్ కాలేజీ లెక్చరర్ తదితర పోస్టులను పదోన్నతి ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇవ్వడం లేదని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాసం ప్రభాకర్ అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం అసోసియేట్ అధ్యక్షుడు టి.ప్రకాష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు ఎండీ కలీల్ అహ్మద్, తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా విద్యాశాఖలో పనిచేస్తున్న సుమారు 12వేల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు రావల్సిన పదోన్నతులు రాలేదని అన్నారు. గత ప్రభుత్వాలు ఉమ్మడి సర్వీస్ రూల్స్ పేరుతో జీవోలు తెచ్చి ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కలిపి ఇవ్వడంతో తమకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఆ జీవోలపై తాము రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ఉమ్మడి సర్వీస్ రూల్స్ చెల్లదని తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని అన్నారు. అన్ని మండలాలకు ప్రభుత్వ ఉపాధ్యాయులకే పదోన్నతులు కల్పించి ఎంఈఓలుగా నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం నాయకులు వై.కృష్ణారావు, పోశం కృష్ణమూర్తి, శ్రావణ్ కుమార్, సైదుల్ రెడ్డి, సంపత్ కుమార్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్ఫూర్తిని అలవర్చుకోవాలి

● ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : కులమతాలకతీతంగా పౌరులందరూ జాతీయ స్ఫూర్తిని అలవర్చుకొని దేశాభివృద్ధికి పాటుపడాలని సికింద్రాబాద్ నియోజకవర్గ శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం సీతాఫల్‌మండిలోని వీరమాచినేని పగడయ్య స్కూల్ విద్యార్థులు నిర్వహించిన తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు ప్రేరణను కలిగించేలా సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషిచేయాలని, విద్యార్థుల్లో జాతీయతా భావాన్ని పెంపొందించాలని ఎమ్మెల్యే కోరారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సామల హేమ, కరస్పాండెంట్స్ రమేష్‌బాబు, విజయకుమార్, సమన్వకర్త రాజుసుందర్, మధురానగర్‌కాలనీ అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, శైలేందర్, మిట్టపల్లి బాబురావు తదితరులు పాల్గొన్నారు.



జాతీయజెండాతో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

● కుట్టివెల్లోడి ఆస్పత్రి భవనాన్ని త్వరితగతిన పూర్తిచేయాలి

సీతాఫల్‌మండిలోని కుట్టివెల్లోడి ఆస్పత్రి నూతన భవనాన్ని పూర్తిచేయాలని సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావుగౌడ్ అధికారులకు సూచించారు. మంగళవారం సీతాఫల్‌మండిలో నిర్మిస్తున్న కుట్టివెల్లోడి ఆస్పత్రి భవనం నిర్మాణపనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనుల్లో పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పాత ఆస్పత్రి భవనాన్ని తొలగించి సుమారు పదమూడుకోట్ల రూపాయల వ్యయంతో ఆధునిక హంగులతో నూతన ఆస్పత్రి భవనాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. నాణ్యతలో రాజీపడకుండా పనులు వేగవంతం చేయాలని కోరారు. వివిధ అధికారిక కార్యక్రమాల్లో ప్రోటోకాల్ నింబంధనలు పాటించి తీరాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సామల హేమ, నాయకులు జి.చంద్రశేఖర్, టీఆర్‌టీ శేఖర్, రాజుసుందర్, బాలాజీ, బెజ్జంకిరాజేష్, మురళి పాల్గొన్నారు.



జీహెచ్‌ఎంసీ అధికారులకు వినతిపత్రం సమర్పిస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

'అమరవీరుల స్థూపానికి మరమ్మతులు చేయాలి'

అడ్డగుట్ట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ క్లాక్‌టవర్ వద్ద అధ్వాన్నస్థితిలో ఉన్న అమరవీరుల స్థూపానికి మరమ్మతులు చేపట్టి పూర్వస్థితికి తీసుకురావాలని తెలంగాణ ఉద్యమ సమితి సభ్యులు అధికారులను కోరారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారుల సమితి ఛైర్మన్ సుల్తాన్ యాదగిరి, ప్రధానకార్యదర్శి తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి, వైస్‌ఛైర్మన్ వెంకటస్వామి కోశాధికారి చంద్రన్నప్రసాద్, సమితి నాయకులు కొండస్వామి, యాదగిరి తదితరులు అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ ఉద్యమంలో 1969వ సంవత్సరంలో సికింద్రాబాద్ క్లాక్‌టవర్ వద్ద పోలీస్ ఫైరింగ్‌లో నలుగురు ఉద్యమకారులు మృతి చెందారని, వారి జ్ఞాపకార్థం క్లాక్‌టవర్ వద్ద అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటు చేశామన్నారు. అమరువీరుల స్థూపం పాలరాతిబండలు పగిలిపోయి, రెయిలింగ్ ధ్వంసమై అధ్వాన స్థితిలో ఉందని అధికారులు స్పందించి అమరవీరుల స్థూపాన్ని యథాస్థితికి తీసుకురావాలని కోరారు.



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

'ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి'

తిరుమలగిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం లోత్‌కుంట సరస్వతి నగర్‌లో ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ దోమల ద్వారా వచ్చే వ్యాధుల నివారణకు అవగాహన కల్పించడంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఉచిత మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేశారు. మలేరియా, డెంగ్యూ, వాంతులు విరోచనాలు లాంటి వ్యాధులను అరికట్టడానికి క్యాంపు నిర్వహించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. వైద్య శిబిరంలో ఉచితంగా కాలనీవాసులకు షుగర్, బీపీ టెస్టులు చేశారు. ఉచిత వైద్య శిబిరాన్ని కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత్, ఏఎన్ఎం బాలమణి, ఆశా వర్కర్లు, కాలనీవాసులు సాయిబాబ, శంకరయ్య, రవికుమార్ పాల్గొన్నారు.



ప్రజావాణిలో అర్జీలను స్వీకరిస్తున్న చిన్నారెడ్డి, ప్రత్యేక అధికారి దివ్య

ప్రజావాణికి 475 దరఖాస్తులు

బేగంపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణిలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి, ప్రజావాణి ప్రత్యేకాధికారి దివ్య ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. మంగళవారం ప్రజావాణికి మొత్తం 475 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూకు సంబంధించి 120, మైనారిటీ వెల్ఫేర్‌కు చెందిన 60, సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన 53, పౌరసరఫరాల శాఖకు చెందిన 36, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధికి సంబంధించి 38, ఇతర శాఖలకు చెందినవి 168 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఫెర్నాండెజ్ ఆస్పత్రిలో గర్భిణులకు ఉచిత దంత పరీక్ష

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నెక్లెస్ రోడ్‌లోని పీవీ మార్గ్‌లో గల ఫెర్నాండెజ్ ఆస్పత్రిలో రెండవ త్రైమాసికంలో ఉన్న గర్భిణులకు ఉచిత దంత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్, ఆపరేషన్స్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ తేజస్విని కుష్‌నూర్ తెలిపారు. మంగళవారం ఆస్పత్రి ఆవరణలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఇది తల్లులు, శిశువుల శ్రేయస్సు కోసం అవసరమైన నోటి ఆరోగ్య సంరక్షణ, వ్యాధి నివారణ చర్యలను అందిస్తుందన్నారు. గర్భధారణ సమయంలో చిగుళ్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం వల్ల శిశువులు ప్రీ-ఎక్లాంప్సియా, అకాల పుట్టుక, తక్కువ బరువుతో పుట్టే ప్రమాదాన్ని తగ్గించవచ్చన్నారు. పీరియాడోంటల్ (గమ్, ఓరల్ కేవిటీ) చికిత్స అనేది గర్భధారణ సమయంలో నోటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి సురక్షితమైన, సమర్థవంతమైన పద్ధతి అని, ఇది తల్లి, బిడ్డలకు ఇద్దరికీ సహాయపడుతుందన్నారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్యలో ఈ సేవలను వినియోగించుకోవచ్చన్నారు.

నేడు ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్ మేళా

హైదరాబాద్ సిటీ, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత కోసం జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ అర్హత కలిగి ఆసక్తి ఉన్న నిరుద్యోగులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో బుధవారం ఉదయం 10.30గంటలకు జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో జరిగే జాబ్‌మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాలో ఎంపికైన వారికి నెలకు రూ.15వేల వేతనం ఉంటుందని, ఆసక్తి కలిగిన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ మంగళవార నోములు

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాస రెండవ మంగళవారం సందర్భంగా సికింద్రాబాద్ ఆవులమందలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని, ఆలయాన్ని మొక్కబుట్టలతో సుందరంగా అలంకరించారు. దేవస్థానానికి పెద్ద ఎత్తున వచ్చిన మహిళా భక్తులు ఒకరికి ఒకరు పసుపు, బొట్టు, వాయినాలుగా ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ సందర్భంగా రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు చందా బాలేందర్, ప్రధాన కార్యదర్శి తమ్మి వెంకటేష్, కోశాధికారి మనుసాని శరత్ బాబు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన చీర సుచిత్ర



జాతీయ జెండాలను ఆవిష్కరిస్తున్న కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ జె.రామకృష్ణ

హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలి

● జన్యావుల రామకృష్ణ

మారేడుపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రజలంతా తమ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని కంటోన్మెంట్ బోర్డు వైస్ ప్రెసిడెంట్ జన్యావుల రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... గత కొన్ని సంవత్సరాలుగా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అలాగే ఈ సంవత్సరం కూడా కంటోన్మెంట్‌వాసులు పెద్ద ఎత్తున తమ ఇంటిపై గర్వంగా జాతీయ జెండాలను ఎగురవేసి స్వాతంత్ర్య వేడుకల్లో భాగం అవ్వాలని సూచించారు.



బ్రాహ్మణబస్తీలో ఇళ్లపై జాతీయపతాకాలను ఎగురవేస్తున్న మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్

బ్రాహ్మణబస్తీలో ఇళ్లపై జాతీయజెండా

బౌద్ధనగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో మంగళవారం సీతాఫల్‌మండి డివిజన్ బ్రాహ్మణబస్తీలో బీజేపీ నాయకులు పలు ఇళ్లపై జాతీయపతకాలను ఎగురవేశారు. బీజేపీ సికింద్రాబాద్ మహాకాళి జిల్లా మీడియా జాయింట్ కో-ఆర్డినేటర్ అజయ్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పి.స్వరూపగౌడ్‌తో పాటు నాయకులు వేణుగోపాల్, లక్ష్మణ్, జగదీష్, రాజేశ్వర్‌చారి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

జాతీయపతాకాల పంపిణీ

బౌద్ధనగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపుమేరకు హర్‌ఘర్ పే తిరంగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి బీజేపీ నాయకులు సీతాఫల్‌మండిలో జాతీయ పతాకాలను పంపిణీ చేశారు. సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కన్వీనర్ కనకట్ల హరి ముఖ్యఅతిథిగా పాల్గొని ఇంటింటికి వెళ్లి జాతీయపతాకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

● కాపాడిన స్థానికులు, పోలీసులు

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఐదు రోజుల క్రితం బంధువుల ఇంటికి వచ్చిన మహిళ ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మంగళవారం సెక్రటేరియట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... ఖమ్మంకు చెందిన మహమ్మద్ ఇర్ఫాన్ ఉద్యోగరీత్యా ఖతర్‌లో ఉంటున్నాడు. ఈమధ్య కాలంలో ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న అతని భార్య (34) షేక్‌పేట్ దర్గా సమీపంలో గల హుస్సేన్ షావలి వద్ద నివసించే తన అక్క ఇంటికి వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం ట్యాంక్‌బండ్‌పై ఉన్న చిల్డ్రన్స్ పార్క్ వద్దగల హుస్సేన్ సాగర్ జలాశయంలో మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీనిని గమనించిన స్థానికులు కాపాడి, పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు ట్యాంక్‌బండ్ శివకు కాల్ చేసి విషయం చెప్పడంతో వెంటనే స్పందించిన శివ ఘటనా స్థలానికి చేరుకుని జలాశయంలో దూకి ఆ మహిళను కాపాడాడు. పోలీసులు మహిళకు గాంధీ ఆస్పత్రిలో వైద్య చికిత్సను చేయించి, కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అపార్ట్‌మెంట్‌లకు ఒకేచోట డస్ట్ బిన్ ఉండాలి

● గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్‌లో డోర్ టూ డోర్ తిరగకుండా ఒకేచోట డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేస్తే చెత్త సేకరణ సులభతరమవుతుందని, అందుకోసం అపార్ట్‌మెంట్ అసోసియేషన్లను సంప్రదించి బిన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కమిషనర్ ఆమ్రపాలి అడిషనల్, జోనల్ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపార్ట్‌మెంట్‌లలో చెత్తసేకరణ వివిధ కారణాలతో పూర్తి స్థాయిలో స్వచ్ఛ ఆటోలకు రావడం లేదని, డస్ట్‌బిన్ ఏర్పాటు చేయడం వల్ల చెత్తను స్వచ్ఛ ఆటోలో తీసుకునేందుకు సులభతరమవుతుందని అన్నారు. పార్కుల వద్ద పరిశుభ్రంగా ఉండేలా డస్ట్‌బిన్లు ఉండాలన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చెత్త వేయకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్ల వివరాల నివేదిక అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జంక్షన్ల వద్ద వాహనదారులకు ఆహ్లాదకరంగా ఉండే విధంగా పూల మొక్కలు ఏర్పాటు చేయాలని యూబీడీ అధికారులకు సూచించారు. పశువులు రోడ్లపై సంచరించకుండా క్షేత్రస్థాయి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు.



పూర్ణాహుతి కార్యక్రమంలో స్వామి అభిషేక్ బ్రహ్మచారి, మురళీధరరావు, రోహిత్‌కుమార్ సింగ్, వేదపండితులు

శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయంలో పూర్ణాహుతి

పద్మారావునగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పద్మారావునగర్, స్కంధగిరిలోని శ్రీ సుబ్రమణ్యస్వామి దేవాలయం ఆవరణలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం వారాణసికి చెందిన స్వామి అభిషేక్ బ్రహ్మచారి దివ్యాసిస్సులతో, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ పూర్ణాహుతి, విద్య, కోటి కుంకుమార్చన, లలిత సహస్రనామ పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపి (రాజ్యసభ), ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్, బీజేపీ సీనియర్ నాయకుడు మురళీధర్‌రావు హాజరయ్యారు. ముఖ్యనిర్వాహకుడు యువ చేతన జాతీయ సమన్వయకర్త రోహిత్‌కుమార్ సింగ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

అవసరం మేరకు అవయవాలు లభించక ..
ప్రాణాలు పోతున్నాయి

● యశోద ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అవసరమైన అవయవాలు లభించక దేశవ్యాప్తంగా మూడు లక్షల మందికిపైగా మరణిస్తున్నారని అందుబాటులోఉన్న గణాంకాలు చెబుతున్నాయని యశోద ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి పేర్కొన్నారు. అంతర్జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా మంగళవారం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన 'సెలబ్రేటింగ్ సెకండ్ చాన్స్ 'సే' కార్యక్రమంలో గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, లివర్ మార్పిడి చేసుకుని పునర్జన్మ పొందిన రోగులతో ఆత్మీయసమ్మేళన నిర్వహించారు. మార్పిడి చేసుకున్న తరువాత వారి జీవనశైలి ఎలా ఉంటుంది, ట్రాన్స్‌ప్లాంట్‌కు ముందు వారు అనుభవించిన అనారోగ్య సమస్యలు.. అవయవ మార్పిడి తరువాత వారు అనుభవిస్తున్న (క్వాలిటీ లైఫ్) మెరుగైన జీవన విధానం ఎలా ఉంటుందనే దానిపై ప్రస్తుతం ట్రాన్స్‌ప్లాంట్ చేయించుకునేందుకు సిద్ధంగా ఉన్నవారు పడే ఆందోళన, అపోహలను తొలగించి అవయవ మార్పిడి ద్వారా జీవితాలను ఎలా కాపాడుతుందో అనే అంశాలను ఈ కార్యక్రమంలో వివరించినట్లు ఆయన చెప్పారు. బ్రెయిన్ డెత్ కేసులకు సంబంధించి అవయవాల దానం ప్రస్తుతం ఉన్న 0.36 రేటు నుంచి స్వల్పంగా పెరిగి 1కి చేరుకున్నా, రెట్టింపు సంఖ్యలో వ్యాధిగ్రస్థుల ప్రాణాలు నిలుస్తాయన్నారు. దేశంలోనే అత్యధికంగా ప్రతీ పదిలక్షల జనాభాకు అయిదు మంది వరకూ ఇక్కడ అవయవదానం చేస్తున్నారని డాక్టర్ పవన్ గోరుకంటి అన్నారు. మన రాష్ట్రానికి చెందిన 'జీవన్ దాన్' దేశంలో క్రియాశీల కార్యక్రమాలలో ఒకటిగా గుర్తింపు లభించిందని, రాష్ట్రంలో అవయవదానాల సంఖ్య క్రమంగా పెరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే అవయవదానాల ద్వారా ప్రజల ఆయుష్షును పెంచే రాష్ట్రంగా దేశంలోనే తెలంగాణ అగ్రస్థానానికి చేరుకున్నదని, దీనివల్ల అవయవమార్పిడి సర్జరీల నిర్వహణ కేంద్రంగా హైదరాబాద్ నగరం దేశంలోనే ప్రధాన నగరంగా మారిందన్నారు. సికింద్రాబాద్ యూనిట్ హెడ్, డాక్టర్. విజయ్‌కుమార్ మాట్లాడుతూ సెలబ్రేటింగ్ సెకండ్ చాన్స్ కార్యక్రమం మరణం తర్వాత ఒక వ్యక్తి తన అవయవాలు దానం చేయడంవల్ల ఎంత మందికి కొత్త జీవితాన్ని ఇవ్వొచ్చని తెలియజేసే గొప్ప రిమైండర్ కార్యక్రమన్నారు.



సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన 'సెలబ్రేటింగ్ సెకండ్ చాన్స్ 'సే' కార్యక్రమంలో వైద్యులు, పేషంట్లు